క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పత్ర కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, ప్రతీ రైతు ప్రకృతి సేద్యం చేసేందుకు ఆసక్తి కనబరచాలని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎల్.శంకరరావు అన్నారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పంటల సంరక్షణకు వినియోగించే నీమాస్త్రం, జిల్లేడు, వేప, పత్ర కషాయాల తయారీ, ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందని, అలాగే ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయని తెలియజేశారు.

వరి పంటలో సస్యరక్షణ



వరి పంటలో సస్యరక్షణ చేపడుతున్న రైతులు

రేగిడి: మండలంలోని ఉనుకూరులో వరి పంటకు తెగుళ్లు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం కుళ్లు తెగులు పంటకు సోకే ప్రమాదం ఉన్నందున వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు పంటకు ఎరువులు వేస్తున్నారు.

పారాది కాజ్‌వే పరిశీలన



పారాది కాజ్‌వే వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వేను ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పరిశీలించారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాజ్‌వే మీదుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో వంతెన మీదుగా వాహనాల రాకపోకలపై ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. 10 టన్నుల బరువున్న వాహనాలనే పాత వంతెన మీదుగా అనుమతించాలని తెలిపారు. వరద ఉధృతి తర్వాత మరమ్మతుల అనంతరం వాహనాలను యథావిధిగా అనుమతించవచ్చన్నారు. ప్రస్తుతానికి రామభద్రపురం వద్దనే వాహనాలను ఆపి, వాటిని దారి మళ్లించాలని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు

రేగిడి: అధిక మోతాదులో పంటలకు రసాయనిక ఎరువులు వాడవద్దని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి, ఉంగరాడ, సోమరాజుపేట, చాటాయవలస తదితర గ్రామాల్లో చేపడుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. వరి పంటలో రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే చీడపీడలు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు.

నేత్రదానంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, విద్యార్థినులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామ ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించారు. పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా నేత్రదానం చాలా గొప్పదన్నారు. మనమిచ్చే కళ్లు మరో ఇద్దరు అంధులు చూపునిస్తుందన్న విషయం మర్చిపోవద్దన్నారు. నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల వసతి గృహం వార్డెన్ లలితకుమారి తల్గొన్నారు.

బండి.. కదలదండి..!



పొక్లెయిన్ సహాయంతో గోతిలో ఉండిపోయిన వ్యాన్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో వాహనదారుల ఇక్కట్లు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోతూ కదిలేందుకు మొరాయిస్తున్నాయి. అధికారులు కనీసం గోతులను మెటల్‌తో కప్పే ప్రయత్నం కూడా చేయకపోవడంతో ఈ దుస్థితి తలెత్తోందని వాహనదారులు వాపోతున్నారు. సోమవారం పాలకొండ రోడ్డులోని పెట్రోల్‌బంకు సమీపంలో వ్యాన్ ఇలా గోతిలోకి దిగి ఆగిపోగా, దానిని పొక్లెయిన్ సహాయంతో ముందుకు కదిలించారు.

నిను మరువం రాజన్నా..!



రామభద్రపురం: ఆరికతోటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న అభిమానులు

మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. నిను మరువం రాజన్నా అంటూ జోహార్ వైఎస్సార్, వైఎస్సార్ అమర్‌రహే అని నినాదాలు చేశారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ సుపరిపాలన అందించిన గొప్ప నాయకుడు.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్టులు అందించిన రైతు బాంధవుడు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి, పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించిన విద్యాదాత.. ఆరోగ్యశ్రీ పథకంతో నిరుపేద ప్రజలకు పునర్జన్మ ప్రసాదించిన ప్రాణదాత.. వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఐదేళ్ల మూడు నెలలే పాలించినా తనదైన పరిపాలనతో జనం గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. – బొబ్బిలి, రాజాం



రాజాం: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ తలే రాజేష్



వంగర: రుషింగిలో మహానేతకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ శ్రీను, తదితరులు



తెర్లాం: కూనాయవలసలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ అభిమానులు



రాజాం: మారేడుబాకలో వైఎస్సార్ అమర్‌రహే అని నినాదాలు చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్, తదితరులు



బొబ్బిలి: వైఎస్సార్ గొప్పతనం వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



బాడంగి: కోడూరులో జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న ఎంపీపీ గౌరి, తదితరులు



సంతకవిటి: గోళ్లవలసలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ దాలినాయుడు, తదితరులు



వంగర: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు, తదితరులు



రామభద్రపురం: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



మెంటాడ: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



రాజాం సిటీ: అమ్మవారి కాలనీలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ అభిమానులు



బాడంగిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రామారావు, జేసీఎస్ కన్వీనర్ శంకరరావు తదితరులు



తెర్లాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, తదితరులు



రేగిడి: ఏవీపురంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ

మట్టి విగ్రహాలనే వాడండి

- వినాయక చవితి పండగ నేపథ్యంలో ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ విజ్ఞప్తి

బొబ్బిలి: వినాయక చవితి పండగలో పూజల కోసం మట్టి గణపతి విగ్రహాలనే వాడాలని ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ సూచించారు. స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో మండల కేంద్రానికి చెందిన గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాన్ని ఆర్‌డీవోకు సోమవారం అందజేశారు. పర్యావరణ హితం కోరుతూ మట్టి విగ్రహాల ఆరాధనను ప్రోత్సహిస్తూ ప్రతిమలు పంపిణీ చేస్తుండడం అభినందనీయమని ఆర్‌డీవో అన్నారు. ప్రజలు కూడా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడకుండా మట్టి గణేశుని విగ్రహాలనే వాడి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్, మున్సిపల్ కమీషనర్ ఎల్.రామలక్ష్మి, హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ, సొసైటీ ప్రతినిధులు కృష్ణదాస్, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డీవో సాయిశ్రీకి మట్టి గణపతి విగ్రహాన్ని అందజేస్తున్న గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు

నేడు ఉచితంగా పంపిణీ..

బొబ్బిలి: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ సీహెచ్ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిలు పాల్గొని, విగ్రహాలు అందజేస్తారన్నారు. విగ్రహాలు కావాలనుకునే వారు ఆలయం వద్దకు రావాలన్నారు.

అభివృద్ధి పనులకు చర్యలు

రేగిడి: మండలంలోని అప్పాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కరణం నిర్మల సోమవారం తెలిపారు. అప్పాపురం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, మురుగుకాలువల నిర్మాణం నిమిత్తం రూ.12.45 లక్షలు, మజ్జిరాముడుపేట బీసీ కాలనీలో సీసీ రోడ్డు, మురుగుకాలువల నిర్మాణం కోసం రూ.12.40 లక్షల నిధులు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరయ్యాయన్నారు. ఆయా పనుల కోసం గ్రీవెన్స్‌సెల్‌లో దరఖాస్తు చేయగా, పంచాయతీరాజ్ విభాగం ఆయా పనులకు అంచనాలు రూపొందించి, నిధులు మంజూరు చేసినట్లు వైఎస్సార్ సీపీ నేత కరణం శ్రీనివాసరావు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



108 సిబ్బందికి నిత్యావసరాలు అందజేస్తున్న మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్

బొబ్బిలి: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా స్థానిక అమ్మిగారి కోనేరు దగ్గరున్న వైఎస్సార్ విగ్రహం వద్ద 108, 104 వాహనాల సిబ్బందికి నిత్యవసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ వీటిని వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాజాం: పట్టణంలోని అమృత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేగిడి మండలం, బూరాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వావిలపల్లి బంగారునాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పరామర్శించారు. సోమవారం ఆస్పత్రికి వెళ్లి, ఆయన ఆరోగ్యంపై వాకబుచేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్, రేగిడి మండల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు,



బంగారునాయుడును పరామర్శిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, తదితరులు

జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, రేగిడి వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, రాజాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామెదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

రేగిడి: మండలంలోని ఉనుకూరులో సోమవారం జరిగిన చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన మజ్జి భారతి వ్యవసాయ పనుల నిమిత్తం అరసాడ గ్రామం వైపు ఉన్న తమ పొలానికి ఒంటరిగా రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా అటువైపుగా ముఖానికి రుమాళ్లు కట్టుకుని బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై దాడికి పాల్పడి, ఆమె మెడకు ఉన్న తులమున్నర బంగారం పుస్తెలతాడును లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన నుంచి తేరుకున్న భారతి ఇంటికి వెళ్లి, బంధువులకు జరిగిన విషయం తెలిపింది. ఇదే ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర గ్రామానికి చేరుకుని, ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం బాధితురాలి వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేత



బొబ్బిలి: రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు



బాడంగి: రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

బొబ్బిలి: మండల కేంద్రం నుంచి పార్వతీపురం వెళ్లే ప్రధాన రోడ్డులోని గోతులను పూడ్చివేసే చర్యలను ఎట్టకేలకు చేపట్టారు. గత కొన్నాళ్లుగా గుంతలమయమైన ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ రోడ్డులో రాత్రిపూట ప్రయాణం మరీ కష్టంగా ఉందని, ఒక్కోసారి వాహనం పైనుంచి గుంతల్లో పడి గాయాలపాలవుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా సోమవారం గుంతలను పూడ్చివేయించారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాలి.

బాడంగి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు చాలా అధ్వానంగా తయారైంది. పూర్తిగా గుంతలమయమై, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్పందించిన ఎస్ఐ తారకేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి లారీలతో మట్టివ్యర్థాలు తెప్పించి, జేసీబీ సహాయంతో రోడ్డుపై ఉండే గుంతలు పూడ్చివేయించారు. పోలీసులు చేసిన ఈ మంచిపనిని అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే బేబీనాయన చూసి, ఎస్ఐను అభినందించారు.

నీటమునిగిన పంట పరిశీలన

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామంలో నీటమునిగిన వరి పంటను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, లక్ష్మణ్‌లు వ్యవసాయాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సాయన్న గెడ్డ వరదనీటితో పొంగిపొర్లింది. దీంతో ఆ గెడ్డ దగ్గరలోని పంటలు నీటమునిగినట్లు రైతుల ద్వారా అధికారులు తెలుసుకున్నారు. అనంతరం వారు నీటమునిగిన పంట పాడవ్వకుండా తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు. ప్రస్తుతం పంట పిలక దశలో ఉందని, ఈ దశలో సాధారణ రకమైన పంట ఐదు రోజుల పాటు నీటిలో మునిగి ఉన్నా బతికే అవకాశం ఉందని తెలిపారు. ముంపును తట్టుకునే రకాలైన ఎంటీయూ 1140, ఎంటీయూ 1172, ఎంటీయూ 1223, ఎంటీయూ 1064లు వారం రోజుల పాటు నీటిలో ఉన్నా పంటకు ఏమీ కాదన్నారు. ఎంటీయూ 1232 రకం 10 నుంచి 12 రోజుల పాటు వరదనీటిలో ఉన్నా అవి తట్టుకోగలవన్నారు. నీరు



నీటమునిగిన వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను అదనంగా పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటను ఆశించే పొడ తెగులు నివారణకు లీటరు నీటికి 2.0 మిల్లీలీటర్ల హెక్సాకోనజోల్‌ను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజాం వ్యవసాయ సహాయక సంయుక్త సంచాలకులు కె.చంద్రరావు, మండల ఏవో పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామభద్రపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి కోరారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బూసాయవలస గ్రామంలోని రామమందిరం, కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో పౌష్టికాహార ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో తప్పనిసరిగా పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకుంటే గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

తెర్లాం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి సూచించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో లబ్ధిదారుల గృహాలను సోమవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు.



రామభద్రపురం: బూసాయవలస కేజీబీవీలో రక్తహీనత నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గర్భిణులకు సీమంతం..

బొబ్బిలి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం సోమవారం చేశారు. ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పార్వతి, వైద్యుడు డి.సాయికుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అరుణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: పౌష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి



బొబ్బిలి: గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఇద్దరు రోగులకు ఒకటే బెడ్!



ఒకే బెడ్ మీద చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

బొబ్బిలి: పట్టణంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి రోగుల తాకిడి ఎక్కువైంది. వర్షాలు కురుస్తుండడంతో నీటి కలుషితం, అపరిశుభ్రత కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. అనారోగ్యం బారినపడిన ఎంతోమంది ఆస్పత్రి బాటపడుతున్నారు. అయితే ఆస్పత్రిలో సరిపడ బెడ్లు(మంచాలు) లేకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు చొప్పున చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఒక సమస్యతో ఆస్పత్రికి వస్తే మరో సమస్య వచ్చినట్లు ఉందని రోగులు, రోగి బంధువులు అనుకుంటున్నారు. ప్రతిరోజూ 400 వరకు ఓపీ వస్తోందని, ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చిన వారికి సరిపడ మంచాలు లేకపోవడం వాస్తవం ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని సీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ జి.శశిభూషణరావు తెలిపారు.